# 26. ఒరులేయవి యొనరించిన

**మా** ఆఫీసులో 'వాసు' అని ఒక సీనియర్ గుమస్తా ఉన్నాడు. అతన్ని చూస్తే నాక్కొంచెం చిరాకో బెదురో అనుకుంటాను, సాధారణంగా అతన్ని నేను పలకరించను. అసలు అతను జాయినైన కొన్నాళ్లదాకా అతనే ఎవర్నీ పలకరించలేదు. "హెచ్.బి" సెక్షన్ నించి మా సెక్షన్‌కి బదిలీ అయి వొచ్చిననాడు, జాయినింగ్ రిపోర్టు మా సూపరింటుకి ఇచ్చేసి బాగా అలవాటైన మనిషిలా వెళ్లి తన సీట్లో కూర్చున్నాడు. నాటి నుంచీ వాసు; సాధ్యమైనంతవరకు నిశ్శబ్దంగా పనిచేసుకు పోతున్నాడు. అంతే. ఎవరితోనూ అవసరం అయితే తప్ప ఏమీ మాట్లాడడు.

ఒరోజు "వాసు" ఆఫీసుకొచ్చిన కొంతసేపటికి అసిస్టెంట్ మేనేజర్ ఆఫీసు కొచ్చేరు. అది గమనించి 'వాసు' ఆయన రూమ్ తలుపు దగ్గరే నుంచుని; "నమస్కారం సార్" అన్నాడు."రండి, లోపలికి" అని ఎ.ఎం. గారు 'వాసు'ని లోపలికి తీసుకుపోయాడు. దాంతో గొడవ వొచ్చిపడింది.

"సూసేరా; మనమంతా రోజూ రెండుపూట్లా ఎ.ఎం. గారెక్కడెదురైతే అక్కడ 'నంస్కారం సార్' అంటున్నాం గదా. మన్నెవల్నయినా లోనకి రమ్మని తనకూడా తీస్కెల్లాడా; ఏయమ్మ?" అన్నాడు అప్పల నర్సయ్య. "ఈన ఈ సెక్సన్లో జాయినైన కాన్నించి యిదేగా, మొదటి నంస్కారం? ఈ కాడికే ఈన్ని లోనకి దీస్కెల్లి మరియాద జేస్తన్నాడు ఏయమ్మ"

అప్పల నరసయ్య ఉపన్యాసానికి ఎవరూ ఏమీ స్పందించక ముందే వాసు ఎ.ఎమ్. రూమ్‌లోంచి ఇవతలికొచ్చేశాడు. నరసయ్య ఊరుకోవచ్చుకదా.

"నమస్కారం సార్" అన్నాడు కొంచెం వ్యంగ్యంగా.

"అయామ్ సారీ, నర్సయ్య గారూ. మీ చేత నమస్కారం పెట్టించుకున్నా మీకేమీ ప్రయోజనం చేకూర్చలేని అసమర్థుణ్ణి. నన్ను వదిలిపెట్టేయండి" అని వాసు తన సీట్లోకి వెళ్లిపోయి నిశ్శబ్దంగా పనిచేసుకుపోసాగాడు. దాంతో వాతావరణంలో టెన్షన్ ఏర్పడిపోయింది. పావుగంటపాటు సెక్షన్‌లో ఫాన్ల చప్పుడు తప్పా మరోటి వినబళ్లేదు.

అప్పుడు సూపరింటు గారు ఏదో కాగితం వాసుకి ఇవ్వవలిసొచ్చినా; అతన్ని తనసీటు దగ్గరికి రమ్మనకుండా తనే వెళ్లి ఆ కాగితం అతనికిస్తూ; నవ్వి; "ఏంటీ, వాసూగారూ; మీరెప్పుడూ సీరియస్‌గా ఉంటారు!" అన్నాడు.

"మీరెందుకలా అన్నారో నాకు తెలుసు సార్. కాని, నాకు ఈ నమస్కారాల కల్చర్ మీద నమ్మకం లేదు" అన్నాడు వాసు.

"మరి ఇందాక ఎ.ఎమ్. గారికి మీరు నమస్కారం చెప్పేరే!"

"అవును, నాకు రేపట్నుంచి మూడురోజులు సెలవు కావాలి, ఎ.ఎం. గారే నా సెలవు గ్రాంట్ చేసే అథారిటీ. అందుకని వారికి నమస్కారం చేసి నా అవసరం విన్నవించుకుని సెలవు గ్రాంటు చేయించుకున్నాను. ప్రతీరోజూ, ప్రతీ పూటా అధికారి ఎక్కడ ఎదురైతే అక్కడ నమస్కారం చెప్పడం వల్ల నమస్కారం విలువ తగ్గిపోయి అదొక హిపాక్రిసీ అయిపోతుందని

నాకు భయం'' అని వాసు వివరిస్తే అందరూ నిర్ఘాంతపోయారు. నాకు కూడా 'నమస్కారం' అనేది 'ఫార్మాలిటీ' అయిపోయి మన సంస్కృతిలో భాగం అయిపోతోందని బెంగ కలిగింది.

మొన్న డిసెంబర్ పదిహేనో తారీఖుని మా సెక్షన్‌కి ఒక ప్రెస్ ఉద్యోగి వచ్చి ఒక స్కీమ్ చెప్పాడు. "ఈ క్రిస్మస్ పండగ మీకు సరదాగా గడవాలనీ; రాబోయే నూతన సంవత్సరం మీమీద శుభాల పరంపరను కుండపోతగా వర్షించాలనీ ఆకాంక్షిస్తున్నాను'' అనే భావం చెప్పడానికి రకరకాల మాటల గారడీలు చేస్తూ; ఇంగ్లీషులోనూ, తెలుగులోనూ మొత్తం డజనుకి పైగా సందేశాలు చూపించేడు. "ఇందులో ఏదో ఒకటి ఎంచుకుని, మొత్తం రెండు వందలకి తక్కువ కాకుండా ఆర్డర్ ఇస్తే; ఎవరికి ఎన్ని కావాలో అన్ని కాపీలు; వారి పేరులతో చిరునామాలతో సహా అచ్చువేసి పందొమ్మిదో తారీక్కల్లా అందజేస్తాను. మీ బంధువులకీ, స్నేహితులకీ మీ స్వంత బాణీలో చవకగా క్రిస్మస్ మరియు న్యూ ఇయర్ గ్రీటింగ్స్ పంపే అవకాశం యిది'' అన్నాడు. ఏ రూల్ పుణ్యం అయితేనేం; మా సెక్షన్‌లో క్రిస్మస్ గ్రీటింగ్స్ పంపే అవసరం సంప్రదాయం ఉన్నవాళ్లు పన్నెండు మంది తేలారు. ఒక్కొక్కరికి పన్నెండేసి చాలునన్నారు. ఆ ఏజెంట్ మిగిలిన వాళ్లని ఎవర్ని అడిగినా రెండు వందలకి కొరదాపడ్డ 56 అవలేదు. "మాకు క్రిస్మస్ లేకుండా కొత్త సంవత్సరం ఒక్కటీ అయితే కావాలి'' అని నలుగురు ముందుకు వస్తే; "మాకు కొత్త సంవత్సరం సంక్రాంతి కలిసినవి ఇస్తే కావాలి'' అని పదిమంది తగిలేరు. మొత్తం మీద 200 అనుకున్నది 480కి ఆర్డర్ తీసుకొని ఎడ్రస్‌లు, ఎడ్వాన్స్‌లు తీసుకొని వెళ్లాడు ఏజెంటు.

'వాసు' ఎందులోనూ చేరలేదు. ఈ సంగతి ఎవరో మేనేజర్ గారి చెవిలో వేస్తే ఆయన సంక్షేమ ఉద్యమం నెత్తిని వేసుకొని హాల్లో కొచ్చి "మీరు కూడా ఏదో ఓ రకం గ్రీటింగ్‌కి ఆర్డర్ ఇయ్యవలసింది, వాసుగారూ! మీ ఫ్రెండ్స్‌కీ, బంధువులకీ పంపొచ్చుకదా!?'' అన్నాడు.

"ఆయన ఎవరో వచ్చి కేన్వాస్ చేసేడు కదా అని అతన్ని ప్రోత్సహించడానికి ఆర్డర్ ఇయ్యాలి తప్పా, నేను అలాంటి కార్డు పంపకపోయినా వాళ్లమంచిని కోరుతూనే ఉంటానని నా బంధువులకీ, స్నేహితులకీ తెలుసు సార్.''

"అంటే? గ్రీటింగ్ కార్డ్ పంపడం తప్పంటారా?'' అన్నారు మేనేజర్.

"తప్పు అని నేను అనను గానండి, అది శుద్ధ దండగండి. మనకి పాశ్చాత్యుల వల్ల తగులుకున్న అనవసరపు ఖర్చండి ఇది. ప్రజల్లో కళాత్మక దృష్టి ఆపేక్షాభిమానాలు పెంచుతున్నట్లు నటిస్తూ ఒకరిమీద ఒకరికి పోటీ పెట్టి ఆ బలహీనత ఆధారంగా ఇదో పెద్ద ఇండస్ట్రీ అయిపోయిందండి. మన పూర్వకాలపు పురాణాల్లో, ఇతిహాసాల్లో, శాసనాల్లో ఎక్కడా కొత్త సంవత్సరం గ్రీటింగుల ప్రసక్తి లేదండి. ఇప్పుడు క్రిస్మస్, కొత్త సంవత్సరం, ఉగాది, దసరా, దీపావళి ఎన్ని గ్రీటింగ్స్ ఒచ్చి పడ్డాయో, పోస్టల్ శాఖవాళ్లు ఊపిరి సలపక బాధపడేటంత!''

మొన్న జనవరి ఒకటో తారీకున వాసు ఆఫీసుకి సెలవు పెట్టేశాడు. వచ్చుంటే "విష్యూ హేపీ న్యూ ఇయర్'' అని ఎవడు పడితేవాడు అతని చేతులు కసితీరా పిసికేసి ఉండేవాళ్లు. రెండో తారీకునాడు ఇంచుమించు అందరికీ కొత్త సంవత్సరం పరగడుపు అయిపోయి, పక్కవాడికి ఈ సంవత్సరం అంతా మాట అలా వుంచి ఈ రోజు, ఈ గంట కులాసాగా

గడవకుండా చూడ్డానికి తగిన జిత్తులు, రాజకీయాలు ప్రయోగించడం మొదలెట్టేశారు. అయితే నరసయ్య మర్చిపోలేదు. వాసుని ఎలాగేనా దెబ్బ కొట్టాలని కదా అతని దీక్ష! అందుకని వాసు ఆఫీసుకి రాగానే నరసయ్య ఎదురెళ్లి, "విష్యు ఏ హాపీ న్యూ ఇయర్!" అని అతని రెండు చేతులూ పట్టుకుని ఊపేశాడు.

"మీరు నాకు ఈ కొత్త సంవత్సరంలో ఏం జరగాలని కోరుకుంటున్నారో అదే మీకూ జరగాలని నేనూ కోరుకుంటున్నాను" అన్నాడు వాసు.

"మళ్లీ మొదటికొచ్చావు గదయ్యా!" అన్నాడు నరసయ్య చప్పున వాసు చేతులు వదిలేసి. "అంటే, నేనీ సెక్షన్నించి ట్రాన్స్‌ఫరై వెళ్లిపోవాలనేగా, నీ ఉద్దేశం?" అని కోపంగా చూసేడు.

వాసు చిరునవ్వు నవ్వేడు. "వెళ్ళిపోతే మాత్రం ఏం లాభం? నేను కూడా అక్కడికే తయారైపోతాను గాబోలు, ఆలోచించండి" అన్నాడు.

సెక్షన్ అంతా గొల్లుమని నవ్వారు.

★

# 27. కొత్తపాటలు పాడుకోమ్మందిరా, ఎంకి!

'నాన్న ఉన్నాడట్రా?' అని అడిగేను లోపలికి ప్రవేశిస్తూ.

వాసు మాట్లాడకుండా, బాత్ రూం వేపు చూపించి, వాడి చెవికి వాడి అరిచెయ్యి దొప్పలా పెట్టుకుని నన్నూ అలా చెయ్యమన్నట్టు సంజ్ఞ చేసేడు. నేను కూడా కళ్లు చికిలించుకుంటూ నా చెవికి నా అరిచెయ్యి దొప్పలా పెట్టుకునేసరికి అంతసేపూ వినపడుతున్న శబ్దాలన్నీ ఏమైపోయేయోగాని బాత్‌రూమ్‌లో మా వెంకన్న బావ పాడుతున్న పాట వినిపించింది. కొన్ని కారణాల వల్ల ఆ పాడుతున్నది మా బావేనా అని అనుమానం వేసి నేను మా మేనల్లుడి వేపు చూడలేదు. అంచేత, వాసుగాడు అక్కడ ఒక కుర్చీ వెయ్యడం వెంటనే తుర్రుమని మరో గదిలోకి పారిపోవడం నేను గమనించలేదు.

'హిస్టరీ లెక్చరుంది, మిస్టరీ పిక్చరుంది; బెస్ట్ ఏదో చెప్పరా!'

అని మా వెంకన్న బావ పాటలో ఒస్తున్న మాటలు విని కుర్చీలో చతికిలపడ్డాను. మైండ్ అంతా నాన్‌ప్లస్ అయిపోయింది. అలా రెండు నిమిషాలు కూర్చునే సరికి మా 'వెంకన్న బావ' ఇవతలికొచ్చి 'బావా, ఎప్పుడు వచ్చితీవు?' అని పాత బాణీలో అడిగేడు.

"ఏదీ, ఇందాకటి పాట మొదట్నించీ పాడు?' అన్నాను.

మొహమాటపడకుండా ఆరంభించేశాడు మా బావ. అందుకే అతనంటే నాకిష్టం. పాటలు పాడ్డం ఒచ్చిన వాళ్లని ఓ పాట పాడమని అడిగితే నాకేమీరాదండీ అనో, గొంతుక సమంగా లేదనో, మూడ్డు బావులేదనో కొంతసేపు మనల్ని ఏడిపించిగాని పాడకపోడం సామాన్యం. మా వెంకన్న బావ అలా కాకుండా ఎప్పటి-ఎక్కడి-ఎలాంటి-పాటైనా సరే, ఒక చిన్న బిట్టు అయినా సరే, 'ఏదీ, ఓసారి అను', అని అడగడం తరువాయి, అందుకుంటాడు.

'బోటనీ క్లాసు వుంది; మేటనీ ఆటవుంది; వోటుదేనికో చెప్పరా!